క్లుప్తంగా

5న 'చలో విజయవాడ'కు ఉద్యోగులు తరలిరావాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కంభం: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన విజయవాడ లయోలా కాలేజీలో నిర్వహిస్తున్న రాష్ట్ర కౌన్సిల్ మూడో మహాసభలను విజయవంతం చేయాలని కంభం తాలూకా అధ్యక్షుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చలో విజయవాడ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన మధ్యంతర భృతి, 12వ పీఆర్సీ, డీఏ బకాయిలు తదితర 14 హక్కుల సాధనకు అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లతో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగస్వామిరెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి నాగంపల్లిలో ధ్వజ ప్రతిష్ట మహోత్సవం



ముస్తాబైన పట్టాభిరామస్వామి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లిలో బుధవారం నుంచి మూడు రోజులపాటు పట్టాభిరామస్వామి ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం గణపతి పూజతో ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ, నూతన ధ్వజ స్తంభ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం రాత్రి కోలాట ప్రదర్శన, శుక్రవారం తిరుపతి ఆగమ పండితులతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, పట్టాభిరామస్వామి శాంతి కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఓటరు జాబితాలో సవరణకు అవకాశం



మాట్లాడుతున్న ఈఆర్ఓ వెంకటశివరామిరెడ్డి

గిద్దలూరు రూరల్: ఓటరు జాబితాలో తప్పులను గుర్తించి వాటిని సవరించుకునే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలని ఈఆర్ఓ ఎం.వెంకటశివరామిరెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామాను పరిశీలించుకోవాలని చెప్పారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఓటర్ల జాబితాలు పకడ్బందీగా రూపొందించేందుకు రాజకీయ నాయకులు ప్రయత్నించాలని కోరారు. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ వారి అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏడాది వ్యవధిలోనే చేతులెత్తేసిన కూటమి

- హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలం
- నిద్రపోతున్న కూటమి సర్కారును మేల్కొలిపేందుకే వెన్నుపోటు దినం
- వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యేలు కేపీ, అన్నా పిలుపు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ నాయకులు

బేస్తవారిపేట:

మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఏడాది కాలంలోనే అన్నివిధాలుగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్‌ను బేస్తవారిపేటలోని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. కూటమి పాలనలో సమాజంలోని ఏ వ్యక్తిగానీ, వర్గంగానీ సంతృప్తిగా లేరన్నారు. మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, యువత ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని రంగాలకు చెందిన వ్యక్తులు చంద్రబాబు పాలనలో దగా పడ్డారన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ప్రజల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం వస్తోందన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచినందుకు నిరసనగా, నిద్రపోతున్న టీడీపీ ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బేస్తవారిపేట బస్టాండ్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా బాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ నెమలిదిన్నె చెన్నారెడ్డి, ఎంపీటీసీలు చిరంజీవి, బాలరంగయ్య, సర్పంచ్‌లు నర్రా రమణారెడ్డి, నాయకులు బొల్లా బాలిరెడ్డి పి.ఈశ్వరరెడ్డి, భీమయ్యయాదవ్, టీవీఎస్‌పీ శర్మ, మాచర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ధర్మకర్త బొంతల లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

నేడు మార్కాపురంలో వెన్నుపోటు దినం



అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను అమలు చేయనందుకు నిరసనగా బుధవారం మార్కాపురం పట్టణంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ 6 హామీలను అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు.

బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలి

- సబ్ కలెక్టర్‌కు బీసీ సంక్షేమ సంఘ నాయకుల వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఎల్పీ యాదవ్ తదితరులు

మార్కాపురం: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బీసీ బాలికలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నేత పీఎల్పీ యాదవ్, ఇండ్ల రంగస్వామిగౌడ్, నాయకులు రాజ్ కుమార్, అబ్రహం తదితరులు సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వారు సబ్ కలెక్టర్‌ను కలిసి బాలికల సమస్యను వివరించారు. సుమారు 150 మందికిపైగా విద్యార్థినులు మార్కాపురం పట్టణంలో వివిధ ప్రైవేట్ హాస్టల్స్, అద్దె గదుల్లో ఉంటూ చదువుకుంటున్నారని, వీరి కోసం ప్రత్యేక వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం తరుపున ఈ సమస్యపై పలు దఫాలుగా అధికారులకు అర్జీలు అందజేశామన్నారు. బాలికలు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండి చదువుకోవాలంటే తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని, దీంతో కొందరు చదువుకు దూరమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని అయినా వసతి గృహాన్ని ప్రారంభించాలని విన్నవించారు. ముఖ్యంగా పుల్లలచెరువు, త్రిపురాంతకం ప్రాంతాల నుంచి వస్తున్నటువంటి బాలికలకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయడం ద్వారా డ్రాపౌట్స్‌ను నివారించవచ్చన్నారు. తమ వినతిపై సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పీఎల్పీ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌గౌడ్, వెంకటేష్, నారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి 'అన్నా' నివాళి



వీరబ్రహ్మరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: మండలంలోని కుంచేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పేరం వీరబ్రహ్మరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, పేరం సుబాష్‌చంద్రబోస్‌రెడ్డి, పేరం నాగిరెడ్డి, నారాయణరెడ్డి, కొత్తపుల్లి బ్రహ్మారెడ్డి ఉన్నారు.

విద్యతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

గిద్దలూరు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాల్య దశ నుంచి చక్కటి క్రమశిక్షణను అలవర్చుకోవాలని, పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఏదైనా సాధించేలా తయారవుతారని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, యువప్రగతి సంస్థ అధ్యక్షుడు ఫరూక్, విశ్రాంత ఉపాధ్యాయుడు బి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మార్కాపురం: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం వారితో కథలు చెప్పించడం, పుస్తకాలు చదివిదించడంతోపాటు చెస్, ఇతర క్రీడాంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచి గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలని లైబ్రేరియన్ జీవీ శివారెడ్డి కోరారు.



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి

బేస్తవారిపేట: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుతారని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. క్రమశిక్షణతో నడుచుకోవడంతో మంచి విజ్ఞానం, నడవడిక, సమాజంలో మంచి గుర్తింపు వస్తాయన్నారు. పాటలు పాడించడం, డ్రాయింగ్, చెస్, ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గురుస్వామి పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాలు పరిశీలించిన సబ్‌కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్న ప్రాంతాన్ని మంగళవారం తహసీల్దార్ చిరంజీవితో కలిసి సబ్‌కలెక్టర్ త్రివినాగ్ పరిశీలించారు. జీఓ ఎంఎస్ నంబర్ 30 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న కట్టడాలను క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో వీటిని పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు. సుమారు 145 మంది ఆక్రమణల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని, వీటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అధికారుల వెంట రెవెన్యూ సిబ్బందితోపాటు కౌన్సిలర్ హర్షిత ఉన్నారు.

కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, పక్కన తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: ప్రభుత్వం అందించే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు పొందేందుకు కౌలు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని తహసీల్దార్ చిరంజీవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కౌలు సాగు హక్కు పత్రాల జారీపై వీఆర్‌ఓలు, వీఏఏలకు అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పంట సాగు హక్కు పత్రం పొందిన రైతుకు సాధారణ రైతుల మాదిరిగానే అన్ని పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కౌలు రైతులు పంట నష్టపోతే పరిహారం పొందే వీలుంటుందని, సబ్సిడీపై విత్తనాలు తీసుకోవచ్చని, అన్నదాత సుఖీభవ పథకం కూడా వర్తిస్తుందన్నారు. ఈ ఏడాది మార్కాపురం మండలంలో 1700 మంది రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మార్కాపురంలో చిరుజల్లులు



మార్కాపురం పట్టణంపై కమ్ముకున్న కారుమేఘాలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలో మంగళవారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మేయడంతో సాయంత్రం 4 గంటలకే చీకటి పడినట్టుగా వాతావరణం మారిపోయింది. రోహిణి కార్తె ప్రభావంతో గత 4 రోజులుగా మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం వాతావరణం కాస్త చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. సోమవారం సాయంత్రం మార్కాపురంతోపాటు కొనకనకనమిట్ల మండలంలో ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. మంగళవారం ఉదయం కూడా అక్కడక్కడా వర్షం కురిసింది.

నలుగురు జూదరుల అరెస్టు

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. నిందితుల నుంచి 4200 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి అనర్థం

గిద్దలూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని మానుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లతో వాటిల్లే ముప్పు గురించి గ్రామంలోని కిరాణా దుకాణాల యజమానులకు వివరించారు. జనపనార, వస్త్రంతో తయారు చేసిన సంచులను ఉపయోగించాలని కోరారు. అనంతరం రామాలయం వద్ద పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈఓఆర్డీ చెన్నారావు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పురంపై దోమల దండయాత్ర

- చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వలు
- ప్రధాన రోడ్ల వెంట డ్రెయినేజీలో తీసిన పూడిక ఎక్కడిదక్కడే..
- దోమలు విజృంభిస్తుండటంతో పట్టణ ప్రజల బెంబేలు
- పారిశుధ్యాన్ని మెరుగుపరచడంపై మున్సిపల్ యంత్రాంగం అశ్రద్ధ

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో పారిశుద్ధ్యం పరిస్థితి నానాటికీ తీసికట్టుగా తయారైంది. ముఖ్యంగా శివారు ప్రాంతాలతోపాటు ప్రధాన వీధుల్లోని డ్రెయినేజీల్లోనూ మురుగు తాండవిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ప్రధాన రోడ్ల వెంట డ్రెయినేజీల్లో తీసిన పూడికను సైతం రోడ్ల మార్జిన్‌లో కుప్పలుగా పోసి మమ అనిపించారు. పేరుకు ఫాగింగ్ చేస్తున్నా దోమల బెడద మాత్రం వీడటం లేదని పట్టణ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. చీకటి పడే సమయం నుంచే దోమలు విజృంభిస్తుండటంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుమారు లక్ష జనాభా ఉన్న మార్కాపురం పట్టణంలో 170 మందికిపైగా పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రధాన వీధుల్లోనే సిబ్బందిని వినియోగిస్తూ మిగిలిన ప్రాంతాలను వదిలేయడంతో పారిశుద్ధ్య సమస్య ఉత్పన్నమవుతోంది. ప్రధానంగా సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణాన్ని ఆనుకొని డివిజనల్ పంచాయితీ ఆఫీసు కార్యాలయం పక్కనే ఉన్న మురుగుకాలువ చెత్తా చెదారంతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. తర్లుపాడు రోడ్డులోని ఎన్‌జీఓ హోమ్, ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ కార్యాలయం తదితర ప్రాంతాల వద్ద కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడం మురుగు ముందుకు కదలడం లేదు. ప్రెస్‌క్లబ్ దగ్గర మురుగు కాలువల్లో తొలగించిన చెత్త కుప్పలను అలాగే వదిలేశారు. ఇదే పరిస్థితి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉంది. ప్రధానంగా అయ్యప్ప స్వామి గుడి వద్ద వర్షం పడితే నడవలేని పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన పూడిక తీత పనులు తాత్కాలిక ప్రయోజనాన్ని మాత్రమే ఇచ్చాయి. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పారిశుధ్యంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రెస్‌క్లబ్ వద్ద రోడ్డుపైనే చెత్త కుప్పలు



ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచ్ వద్ద కాలువలో నిలిచిన మురుగు



డీఎల్‌పీఓ కార్యాలయం వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్త



ఎన్‌జీఓ హోమ్ వద్ద మురుగు కాలువ దుస్థితి